డిఇడి స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాలు

కడప అర్బన్ : హెలెన్ కిల్లర్ కాలేజీ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్, కడప డిఇడి స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి. దౌలత్ ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోర్సు కేంద్ర ప్రభుత్వ రిహాబియుటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిందని తెలిపారు. కోర్సులో చేరేందుకు ఇంటర్మీడియట్ లేదా సమాన కోర్సు పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. ఓసి విద్యార్థులు 50 శాతం, బిసి, ఎస్సి, ఎస్టి, పిహెచ్డి విద్యార్థులు 45 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. కోర్స్ చేసినవారు చెవిటి, మూగ బాలబాలికల ప్రత్యేక పాఠశాలలు, ఇంక్లూజు స్కూల్స్, భవిత కేంద్రాలలో ఉపాధ్యాయులుగా పనిచేయడానికి అర్హులని పేర్కొన్నారు. కోర్సులో చేరదలచిన వారు ఈనెల 14 లోపు దరఖాస్తులను హెలెన్ కిల్లర్స్ కాలేజీ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ రాజు గృహకల్ప రోడ్, సెంట్రల్ జైలు దగ్గర రామాంజనేయ పురం కడపలో అందజేయాలని తెలిపారు.

వైసిపిలో.. అంతర్మథనం

ఎన్నికల్లో ఘోర పరాజయంపై వైసిపిలో అంతర్మథనం నెలకొంది. ఉమ్మడి జిల్లాల్లో వైసిపి కడప, రాజంపేట పార్లమెంట్ స్థానాలు సహా చెరో రెండు అసెంబ్లీ స్థానాలు మినహా మిగిలిన తొమ్మిది స్థానాల్లో ఓటమి పాలు కావడాన్ని జిల్లా నాయకత్వం జీర్ణించుకోలేక పోతోంది. సాచ్యురేషన్ మోడ్‌లో పార్టీలకు అతీతంగా సంక్షేమాన్ని అందించామనే భరోసాతో ఎన్నికలకు వెళ్లిన సంగతి తెలిసిందే. కడప, అన్నమయ్య జిల్లాల్లో ఉక్కు పరిశ్రమ నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టుల పనుల్ని విస్మరించడం మినహా సంక్షేమ పథకాలతోపాటు కొప్పర్తి, గోపవరం ప్రాంతాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉద్యోగాల కల్పన చేసినప్పటికీ ఘోరపరాజయం ఎదురుకావడానికి గల కారణాలను విశ్లేషించే ప్రయత్నం జరుగుతోంది. ఘోరపరాజయానికి సంక్షేమం, ఉపాధులకు పరిమితంగాకుడా పలువురు పార్టీ నాయకులు సామాన్యుల భూములను కబ్జా చేయడం, చివరికి అధికార పార్టీకి చెందిన బద్వేల్ ఎమ్మెల్యే భూములనే కబ్జా చేయడం, వేధింపులకు గురిచేయడాన్ని ప్రతిపక్ష నేత చంద్రబాబు, మీడియాలో పెద్దఎత్తున చర్చనీయాంశం చేయడం వంటి కారణాలు ఉన్నాయనే సంగతిని గ్రహించాల్సిన అవసరం ఉరుముతోంది.

- ఘోర పరాజయ కారణాలపై ఆరా
-ఇంట గెలవలేక...రచ్చ గెలవలేక...!
-భూ కబ్జాలు.. నేతల్లో క్రమశిక్షణ కొరవడడమే?

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపి నేతలకు ఘోర పరాజయం ఓ పట్టాన అంతుబట్టడం లేదు. ఉమ్మడి జిల్లాలకు చెందిన పలువురు వైసిపి నాయకులు దాడులకు బెదిరి తిరుపతి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి రాజంపేట అసెంబ్లీ మినహా మిగిలిన 12 స్థానాలను కైవసం చేసుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి కడప, రాజంపేట పార్లమెంట్ స్థానాలు సహా పులి వెందుల, బద్వేలు, రాజంపేట, తంబళ్లపల్లి అసెంబ్లీ స్థానాలకు పరిమితం కావడం ఆందోళన కలిగించింది. ఇంతటి ఘోర పరాజయా నికి ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. వైఎస్ జగన్ సొంతింట్లో అంటుకున్న కుంపటిని అదుపు చేయలేకపోవడం, తల్లిని, సొంత చెల్లెల్ని నిరాధరణకు గురిచేయడం, పార్టీ నాయకుల్లో సమన్వయలోపం నెలకొనడం, పార్టీ నాయకుల అడ్డూ అదుపూ లేకుండా భూ కబ్జాలకు పాల్పడడం వంటి తప్పిదాల కారణంగా కొన్ని సామాజికవర్గాలు దూరం కావడమైంది. ఫలితంగా సుమారు 10 శాతం ఓటింగ్‌కు దూరమైంది. వైసిపి ప్రభుత్వ విద్య, వైద్యం పాలసీలు పర్వాలేకున్నా కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన వెంటనే జాతీయ విద్యావిధానం, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వంటి విధానాలను అధ్యయనం చేయకుండా అమలు చేయబూనడం ప్రధానమైన తప్పిదాలు. పేదల సంక్షేమాన్ని నమ్ముకుని, పెత్తందారీతనం కలిన పార్టీ నేతల బారిన పడిన పేదల స్థలాల కబ్జాలను కట్టడి చేయకపోవడం, నాయకుల్లో క్రమశిక్షణ కొరవడడం, పార్టీ నాయకుల వ్యవహార సరళిని విస్మరించడం, కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డిని కలవాలంటే తెల్లవారుజామున మూడు గంటలకు పులివెందులకు వెళ్లాల్సి రావడం, ఫోన్‌లో ఎంత ప్రయత్నించినా అందుబాటులోకి రాకపోవడం, ప్రజల సమస్యలకు పరిష్కారం లభించకపోవడం, పులివెందుల అసెంబ్లీ వాసుల సమస్యల ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడానికి అవకాశం లేకుండా పోవడం, అక్కడికి వెళ్లినా వైఎస్ జగన్ నుంచి తిరిగి ఎంపీ దగ్గరికి పంపించడం, ఎంపీ దగ్గర చెప్పుకోలేక, చెప్పినా పరిష్కారం లభించకనే జగన్ దృష్టికి తీసుకెళ్తే తిరుగుటపా ఎంపీ దగ్గరికి రావడం వంటి చర్యలతో తీవ్ర అసంతృప్తి నెలకొంది. మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య ఘటనలో చెల్లెళ్లతో పేచీ పెట్టుకోవడం, సొంత చెల్లెళ్లు సోదరుని రక్తపు మరకల సర్కారును ఓడించాలనే పేరుతో ప్రత్యర్థులుగా మారి ఎన్నికల్లో ప్రచారానికి దిగడం ఘోర పరాజయానికి మచ్చుకు కొన్ని కారణాలుగా పేర్కొనొచ్చు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. అన్నమయ్య, పింఛా రిజర్వాయర్లు కొట్టుకుపోవడానికి సొంత పార్టీ నాయకుని ఇసుక దంపులే కారణమని తెలుసు. అయినప్పటికీ ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమని తెలిసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసు కోలేకపోయారు. గండికోట, సోమశిల, పైడిపాలెం రిజర్వాయర్ల పరిధిలోని ముంపు వాసులకు పరిహారం చెల్లింపులు చేయకపోవడం తీవ్ర అసంతృప్తికి దారితీసింది. సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థలతో పార్టీతో కేడర్‌కు సంబంధాలు క్షీణించడం, పార్టీ కేడర్‌కు నీరు-చెట్టు తరహా కాంట్రాక్టు పనులు లేకపోవడంతో ఉత్సాహం మందగించింది. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు చేయడంలో మీన మేషాలు లెక్కించడం నిర్వేదాన్ని మిగిల్చింది. ఇసుక, మద్యం వ్యవహారాల్లో గందరగోళం నెలకొంది. ఇసుక ధరల కారణంగా భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. మద్య నిషేధం ప్రశ్నార్థకంగా మారింది. వైసిపి సర్కారు హయాంలో కడప, బద్వేల్, రాయచోటి ప్రాంతాల్లో భూకుంభకోణాలు అరాచకానికి కేరాఫ్ అడ్రెస్‌గా మారాయి. కడపలో కీలక నేతలే సిండికేటుగా మారి కబ్జాల నేతలుగా మారడం ఆందోళన కలిగిస్తోంది. జగన్ కడప సొంత జిల్లా కావడంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్లు ఇచ్చారు. కడప అసెంబ్లీ పరిధిలో నాయకుల మధ్య సమన్వయం లోపించడం, ఓటమికి దారి తీసింది. టిడిపి ప్రకటిత సూపర్ సిక్స్, మేనిఫెస్టో మహిళలను ఆకర్షించింది. వైసిపి మేనిఫెస్టోలో రైతు రుణమాఫీ ఉంటుందని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. సరికదా పాత మేనిఫెస్టోనే కావడంతో ప్రజలు కొత్తధనం వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. జిల్లాల విభజన అంశాన్ని పరిశీలిస్తే పార్లమెంట్ స్థానాన్ని జిల్లా కేంద్రంగా మారుస్తామని హామీ ఉల్లంఘించడం, రాజంపేటను కాదని రాయచోటిని జిల్లా కేంద్రంగా ప్రకటించడంపై సొంత పార్టీలోనే అసంతృప్తుల వెల్లువ కొనసాగింది. రాజంపేట వైసిపి అభ్యర్థి గెలవడాన్ని గమనిస్తే ఉమ్మడి జిల్లాల్లో ఓటమి పాలైన అసెంబ్లీ అభ్యర్థుల నాయకత్వ సామర్థ్యం ప్రశ్నార్థకంగా మారినట్లు అర్థమవుతోంది. రాజకీయంగా ఎన్నికల్లో పొత్తులు ఎత్తుల్లో వైఫల్యం ప్రధానంగా కనిపిస్తోంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపితో కూటమి కట్టి అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. టిడిపి, జనసేన, బిజెపితో కలిసి కూటమి కట్టి ఎన్నికల్లో దిగుతోందని తెలిసినప్పటికీ, వైసిపి ఒంటరిగా ఎదుర్కోవాలనుకోవడం పిచ్చితనమా, అహంకారమో, అతి ఆత్మవిశ్వాసమో ఇతర కారణాలేమైనా ఉన్నాయోమే ఆలోచించుకోవాలి.

అమాత్య యోగం ఎవరికి దక్కేనో!

ఉమ్మడి జిల్లాల్లో కేబినెట్ బెర్త్ ఎవరిదనే అంశంపై అందరి దృష్టి నిలిచింది. కడప జిల్లాలో ముగ్గురు, అన్నమయ్య జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల్లో జిల్లాకు ఒకరికి చొప్పున మంత్రి పదవి దక్కే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. వీరిలో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలతోపాటు, కూటమి తరుపున పోటీ చేసి గెలిచిన అభ్యర్థులూ ఉన్నారు. వీరిలో ఎవరి ప్రాధాన్యతలు వారికి ఉన్నప్పటికీ వీరిలో ఎవరిని అమాత్యయోగం వరించనున్నదనే అంశం ఆసక్తికరంగా మారింది.

- రేసులో కడప, మైదుకూరు ఎమ్మెల్యేలు
- మహిళా కోటాలో ఎమ్మెల్యే మాధవికే అవకాశం
- అన్నమయ్య జిల్లాలో ఎమ్మెల్యేలు నల్లారి, అరవ శ్రీధర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మూడు దశాబ్దాలుగా ఉమ్మడి కడప జిల్లా చరిత్రలోనే ఎన్నడూ ఎరగని విధంగా ఉమ్మడి కడప జిల్లాల్లో ఎనిమిది మంది ఎమ్మెల్యే పదవులు ప్రతిపక్ష కూటమికి దక్కడం చర్చ నీయాంశంగా మారింది. కడప, అన్నమయ్య జిల్లాల పరంగా గమనిస్తే కడప జిల్లాలో పులివెందుల, బద్వేల్, అన్నమయ్య జిల్లాలో రాజంపేట, తంబళ్లపల్లి మినహా మిగిలిన తొమ్మిది స్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలిచారు. ఈనెల 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో కూటమి తరుపున కడప, మైదుకూరు, జమ్మలమడుగు, అన్నమయ్య జిల్లాలో పీలేరు, రైల్వేకోడూరు అభ్యర్థుల్లో ఒకరికి అమాత్యయోగం దక్కే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. కడప అసెంబ్లీ చరిత్రను ఓసారి పరికిస్తే 1983 నుంచి నేటి వరకు కడప అసెంబ్లీ అభ్యర్థిగా గెలిచిన వారికి మంత్రి పదవులు దక్కడం ఆనవాయితీగా మారింది. కందుల కుటుంబానికి చెందిన ఎస్.రామమునిరెడ్డి దగ్గర నుంచి సి.రామచంద్రయ్య, ఖలీల్‌బాషా, అహ్మదుల్లా, ఎస్.బి.అంజాద్‌బాషా వరుసగా కీలక పదవులను అలంకించారు. ఇటువంటి చరిత్ర కలిగిన అసెంబ్లీ కావడంతో కడప అసెంబ్లీ అభ్యర్థిగా గెలిచిన ఆర్.మాధవికి మంత్రి పదవి వరించే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. మహిళా అభ్యర్థిని కావడం, పార్టీ కార్యక్రమాల అమల్లో చొరవగా ముందుకు తీసుకెళ్లడం, పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి అధిష్టానం దగ్గర పరపతి కలిగి ఉన్న నేపథ్యాల్ని పరిశీలిస్తే మంత్రి పదవి దక్కే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చెప్పవచ్చు. మైదుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ బిసి కార్డును కలిగి ఉన్న నేపధ్యాన్ని కలిగి ఉండడం, పార్టీ సీనియర్లతో సంబంధాలను కలిగి ఉన్న కారణాల రీత్యా మంత్రి పదవి వరించే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది. కూటమి తరుపున జమ్మలమడుగు అసెంబ్లీ స్థానానికి బిజెపి అభ్యర్థిగా మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి ఆశావహునిగా మారిన నేపథ్యం ఆసక్తిని కలిగిస్తోంది. అన్నమయ్య జిల్లాలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డికి మంత్రి పదవి వరించే అవకాశాలు పుష్కలముగా ఉన్నాయని చెప్పవచ్చు. ఇతనితోపాటు రైల్వేకోడూరు అసెంబ్లీ స్థానానికి కూటమిలో భాగంగా జనసేన తరుపున బరిలో దిగిన అరవ శ్రీధర్‌కు జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ మంత్రి పదవికి పట్టుబట్టే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా అరవ శ్రీధర్ ఎస్సీ అభ్యర్థి కావడం, రాయలసీమలోని 52 అసెంబ్లీ స్థానాల్లో జనసేనకు ఏకైక ఎమ్మెల్యే అభ్యర్థి కావడం వంటి అర్హత, కారణాల రీత్యా మంత్రి పదవికి పట్టు బట్టే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. రాయలసీమలో జనసేన బలపడాలంటే ఉన్న మార్గాంతరం ఉన్న ఏకైక ఎమ్మెల్యే అభ్యర్థికి మంత్రి పదవి లభించే అవకాశాలు పుష్కలముగా ఉన్నాయని చెప్పవచ్చు.

ఆర్. మాధవి

పుట్టా సుధాకర్‌యాదవ్



అరవ శ్రీధర్

నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

శిక్షణలో వైద్యులు, నర్సులు, ఆశాలు

కేన్సర్‌పై అవగాహన అవసరం

- అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి

ప్రజాశక్తి - కడప అర్బన్

కేన్సర్‌పై అవగాహన అవసరమని అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ పేర్కొన్నారు. గురువారం కేన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్ రోజురోజుకూ అధికమవుతుందని చెప్పారు. ఈ వ్యాధి బారినపడి ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలున్నాయని చెప్పారు. కేన్సర్‌ను ముందుగానే గుర్తించి తగిన అవగాహన కలిగి ఉండడం వల్ల మరణాలను తగ్గించవచ్చుని పేర్కొన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కేన్సర్‌ను గుర్తించేందుకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో శిక్షణ పొందిన గైనకాలజిస్ట్, డెంటల్ సర్జన్, ఎస్‌పిఎం, జనరల్ సర్జరీకి సంబంధించిన వైద్యులు ఈనెల ఐదు నుంచి ఏడు వరకు శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని సెకండరీ హెల్త్ సెంటర్లు, పిహెచ్‌సి వైద్యులకు, గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రి కడపలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో నీరు, రొమ్ము, గర్భాశయ కేన్సర్‌ను ముందుగానే ఏ విధంగా గుర్తించాలి, దానికి ఏ మందులు వాడాలి అనే అంశాలపై తెలియజేశారు. శిక్షణ పూర్తి అయిన తర్వాత పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది, నర్సులు, సిహెచ్‌ఒలు, ఎఎన్‌ఎంలు, ఆశాలకు శిక్షణ ఇచ్చామన్నారు. దీని ద్వారా 30 ఏళ్లు పైబడిన వారికి స్క్రీనింగ్ నిర్వహించి కేన్సర్ సంబంధిత లక్షణాలను ముందే నిర్ధారించి, తగిన సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. డయాబెటిక్, బిపి, కేన్సర్‌ను స్క్రీనింగ్ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్. సుర్వేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ రమేష్, ఎన్‌సిడి డాక్టర్ జీవనప్రియా, ఖాజా మొద్దీన్ పాల్గొన్నారు.

మానవ హక్కుల సభ్యులుగా బాదుల్లా, పెద్దన్న

ప్రజాశక్తి - కడప అర్బన్

షా సోషల్ జస్టిస్‌కు, మానవ హక్కుల పరిరక్షణకు చేసిన కృషిని గుర్తించి ఎపి స్టాండింగ్ కమిటీ సభ్యులుగా సుంకేసుల బాదుల్లా, ట్రేడ్ యూనియన్ లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా పగిడాల పెద్దన్నను నియ మించారు. గురువారం షా సోషల్ జస్టిస్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నియామక పత్రాలను షా మహ్మద్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవులు ఇచ్చిన షా మహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ డాక్టర్ ఫరీద్, నాయకులు సిద్దయ్య, సురేష్, లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

నియామక పత్రాలతో బాదుల్లా, పెద్దన్న

రైతు సంఘం సభ్యత్వ నమోదులో దస్తగిరిరెడ్డి

రైతు సమస్యలపై నిరంతర పోరాటం

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

రైతు సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని, సమస్యల పరిష్కారం కోసం రాజకీయాలకు అతీతంగా రైతు సంఘంలో చేరాలని ఎపి రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం చింతకొమ్మదిన్నె మండలంలో కొలుమూలపల్లె పంచాయితీలో రైతు సంఘం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కారం కోసం రైతు సంఘం నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. రైతులు ఎంతో కష్టపడి పంటలు పండిస్తున్న కష్టానికి తగిన ప్రతిఫలం రాకపోగా అప్పులు ఆత్మహత్యలు మిగులుతున్నాయని ఆయన అన్నారు. పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయని, ఎరువులు పురుగుమందులు వ్యవసాయ పరికరాలు పెట్రోల్ డీజిల్ రవాణా ఛార్జీలు విపరీతంగా పెరుగుతున్నాయని వాపోయారు. దేశానికి రైతే వెన్నెముక అంటూనే వెన్నెముక విరిగిపోయేలా ప్రభుత్వాలు భారాలు వేస్తున్నాయని ఆయన తెలిపారు. రైతు సంఘం రైతాంగ సమస్యలపై శక్తి మేరకు నిరంతరం పోరాడుతోందని, భూనిర్వాసిత రైతులకు అండగా నిలబడుతుందని, ప్రకృతి వైపరీత్యాలకు పంటలు నష్టపోయిన సందర్భాలలో నష్టపరిహారాల కోసం, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల కోసం ధర్నాలు రాస్తారోకోలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనలు నిర్వహించిందని ఆయన తెలిపారు. భూసేకరణ పేరుతో రైతుల భూములను తక్కువ నష్టపరిహారం ఇచ్చి బలవంతంగా లాగేసుకుంటున్నారని ఆయన తెలిపారు. బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కొరత కారణంగా సాగు నీటి ప్రాజెక్టులు నత్తనడకన నడుస్తున్నాయని ఆయన అన్నారు. మన సమస్యల పరిష్కారానికి రైతు సంఘాన్ని మరింత బలపరుచుకోవాలని, మన సమస్యలన్నీ ప్రభుత్వాలు పరిష్కరించేలా విస్తృత ఆందోళన నిర్వహించాలని చెప్పారు. రైతులందరూ రాజకీయాలకతీతంగా ఐక్యం కావాల్సిన అవసరమెంతైనా ఉందని, రైతులు, రైతు కుటుంబ సభ్యులందరూ రైతు సంఘంలో సభ్యులుగా చేరాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య సికేదిన్నె మండల అధ్యక్షులు చిన్న సిద్దయ్యతో పాటు రైతులు పాల్గొన్నారు.

అమీర్‌బాబును కలిసిన మత గురువులు

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు దేశం పార్టీ విజయ దుందుభి మోగించిన సందర్భంగా గురువారం నగరంలోని కో - ఆరేటివ్ కాలనీ ఉన్న అమీర్ బాబు స్వగృహంలో ముస్లిం మత గురువులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో అమీర్ బాబు ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. పదవి వస్తే ప్రజలకు మరింత సేవచే యగలరని ఆశా భావం వ్యక్తం చేశారు. అమీర్ బాబు మాట్లాడుతూ కడపలో పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశామని చెప్పారు. రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీ రావాలని చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలను చైతన్య పరుస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించామని పేర్కొన్నారు.

ఎల్ ఎల్ బి ఫలితాలు విడుదల చేస్తున్న విసి సుధాకర్

వైవీయూ ఎల్‌ఎల్‌బి ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఎల్‌ఎల్‌బి (సిబిసిఎస్ విధానం) 3,5 సెమిస్టర్ల పరీక్ష ఫలితాలు విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింత సుధాకర్ గురువారం విడుదల చేశారు. విసి ఛాంబర్‌లో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్. ఈశ్వర్ రెడ్డితో కలిసి ఫలితాల విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎల్‌ఎల్‌బి ఐదేళ్ల కోర్సులో మూడో సెమిస్టర్ పరీక్షలో 50 శాతం, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో 74.68 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వివరించారు. మూడేళ్ల ఎల్‌ఎల్‌బి కోర్సుకు సంబంధించి మూడో సెమిస్టర్‌లో 67.37 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఐదవ సెమిస్టర్‌లో 70.55 శాతం మంది పాసయ్యారని తెలిపారు. వీటితోపాటు ఎల్‌ఎల్‌బి (ఐదేళ్ల డిగ్రీ) 7,9 సెమిస్టర్ ఫలితాలు వెల్లడించారు. 7 సెమిస్టర్ లో 87.32 శాతం మంది, 9 సెమిస్టర్ లో 80.34 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ విభాగ సహాయ అధికారి డాక్టర్ గంగయ్య పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ చైర్మన్ రాజీనామా

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

మండల పరిధిలోని కొత్తపేట గంగమ్మ దేవాలయ చైర్మన్ బిపి విశ్వనాథరెడ్డి గురువారం రాజీనామా చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఘోర పరాజయం పాలవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తుంది. తన రాజీనామా పత్రాన్ని ఆలయ ఇఒ సురేష్ కుమార్‌రెడ్డికి అందజేశారు

సుభిక్షమైన పరిపాలన టిడిపికే సాధ్యం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

రాష్ట్రంలో సుభిక్షమైన, ఆదర్శవంతమైన పరిపాలన అందించాలంటే అది ఒక టిడిపికే సాధ్యమని రాష్ట్ర కల్లు గీత కార్మిక డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య తెలియజేశారు. గురువారం ఉదయం రాష్ట్ర మహిళ కమిటీ సభ్యురాలు ఒబినేని సుబ్బమ్మ, ఒంటిమిట్ట నరసయ్య స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రాక్షస పాలన ముగిసిందని, చంద్రబాబు ఆధ్వర్యంలో రామరాజ్యం వచ్చిందని అన్నారు. జగన్ పరిపాలనలో అరాచకాలు, గుండాయిజం, మాఫియాలు విస్తరించాయని, అవన్నీ ప్రజలు చూసి విరక్తిచెంది మంచి పరిపాలన కోసమై తెలుగుదేశం పార్టీకి అత్యధికంగా ఓట్లు వేసి గెలిపించుకున్నారని చెప్పారు. చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో సంక్షేమ కార్యక్రమాలతోపాటు మంచి పరిపాలనందిస్తారని అది ప్రజలందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని ఆయన అన్నారు రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని తమకు ఆ నమ్మకం ఉందని ఆయన భరోసా ఇచ్చారు ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు జిల్లా ప్రజలకు , నియోజకవర్గస్థాయి మండల స్థాయిలో అందరికీ కార్యకర్తలకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిటీ సభ్యురాలు ఓబినేని సుబ్బమ్మ, మాధవరం శ్రీహరి, గాదె శివకుమార్, గాదె నారాయణ, మోదుగల నరసింహులు, పసుపులేటి రమణ, క్రిష్ణయ్య, కట్ట యానాదయ్య జవ్వాజీ వెంకటరమణ పాల్గొన్నారు.

విజయ సంకేతం తెలియజేస్తున్న టిడిపి నాయకులు

శ్రీనివాసరెడ్డి, మాధవిలను గజమాలతో సత్కరిస్తున్న ఎద్దుల శంకర్

హామీలను కచ్చితంగా అమలు చేస్తాం

- టిడిపి కడప ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ కడప ఎమ్మెల్యేగా తన గెలుపునకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆర్. మాధవి పేర్కొన్నారు. గురువారం దేవుని కడప టిడిపి నాయకులు ఎద్దుల శంకర్, శ్రీధర్, సాయి, రాజా ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్న మాధవి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్ శ్రీనివాసరెడ్డిలకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. పూలమాలతో సత్కరించారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. తాను ఇచ్చిన మేనిఫెస్టోను కడపలో అమలు చేస్తానని చెప్పారు. కార్యకర్తలకు నాయకులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. శాంతియుత కడపను భవిష్యత్తులో చూస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు రామప్రసాద్ రెడ్డి, జయరాం, కృష్ణారెడ్డి, సునీత, అంజి, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించిన ప్రజలు

ప్రజాశక్తి -కడప అర్బన్

ఎన్నికల్లో ఒక్క రూపాయి పంచకున్నా ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారని కాంగ్రెస్ నాయకులు అఫ్జల్ ఖాన్ పేర్కొన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షర్మిలకు, తనకు ఓట్లు వేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. తమది ఓటమి కాదు గెలుపు అన్నారు. ఎన్నికలకు 15 రోజుల ముందు టికెట్ ఇచ్చినా ప్రజలు బాగా ఆదరించారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల సమస్యలను పరిష్కరించేలా ముందుకు వెళతామని చెప్పారు. ఇతర పార్టీలు ఏజెంట్లకు డబ్బులు ఇచ్చారని, తమ మీద ప్రేమతో ఏజెంట్లు స్వచ్ఛందంగా వచ్చి సహకరించారని చెప్పారు. అమ్ముడు పోయింది అంజాద్ బాషా అని విమర్శించారు. అందుకే ప్రజలు తగిన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. కడపలో భూ కబ్జాలు, దర్గా స్థలాలు, రౌడీయిజలకు పాల్పడ్డాడని తెలిపారు. ముస్లిం మైనార్టీల పైన తప్పుడు కేసులు పెట్టారన్నారు. ముస్లిం ఓట్లు మాకు అవసరం లేదని అంజాద్ బాషా చెప్పడం సిగ్గుచేటు అన్నారు. అఫ్జల్ ఖాన్‌కు 2వేల ఓట్లు కూడా రావు అని ఎగతాళి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ 24,500 ఓట్లు ప్రజలు నాకు వేశారని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డికి తనపై తప్పుడు సమాచారం ఇచ్చారని తెలిపారు. తన రాజకీయ భవిష్యత్తుకు అంజాద్ బాషా అడ్డుపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మాధవి రెడ్డి ఇంట్లో దూరుతమని చెప్పడం నిజంగా సిగ్గుచేటు అన్నారు. అంజాద్ బాషా కంటే శ్రీనివాస రెడ్డి వంద రెట్లు మేలని పేర్కొన్నారు. ప్రజల సమస్యల కోసం నిత్యం కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అలీ ఖాన్ పాల్గొన్నారు.

164 సీట్లు రావడం హర్షణీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎన్‌డిఎ కూటమికి రాష్ట్ర ప్రజలు 164 ఎమ్మెల్యే సీట్లు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని కడప మాజీ డిప్యూటీ మేయర్, టిడిపి నాయకులు అరిఫుల్లా పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం అవుతుందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు కట్టించిన అన్న క్యాంటీన్లు, హజ్ హౌస్‌ను సర్వనాశనం చేశారన్నారు. ఇసుక అక్రమ రవాణా చేయడంతో భవన నిర్మాణ కార్మికులు ఎంతో మంది ఇబ్బందులు పడ్డారన్నారు. దేశంలోనే డిజిటల్ లావాదేవీలు చేస్తుంటే, ఆంధ్రరాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి మద్యానికి నగదు తీసుకుని వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. నకిలీ మద్యంతో ఎన్నో వేల ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లిం మైనారిటీల అభివృద్ధి కోసం చంద్రబాబు నాయుడు ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకుని వచ్చి అమలు చేశారన్నారు. అందుకోసమే రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలు ఏకధాటిగా ఏకైక తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించారన్నారు. జగన్మోహన్ రెడ్డి ఎన్నో అరాచకాలు చేశారని అందుకోసమే ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శంకర్ బాలాజీని సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

అవినీతికి పాల్పడుతున్న ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీని సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దుగ్గిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేవాదాయశాఖ ఆలయాలకు సంబంధించి నిష్పక్షపాతంగా అభివృద్ధి చేయడం లేదన్నారు. దేవాదాయ స్థలాలను, కాంప్లెక్స్‌లను అనుకూలమైన వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ప్రొద్దుటూరు, బ్రహ్మంగారిమఠంలో పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ట్రస్టులో వారసులను కాకుండా బయట వ్యక్తులను నియమించి ఆ స్థలాలను ట్రస్టులో ఉన్న నిధులను కాజేసేందుకు సహకరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు దుర్వినియోగమైందని, ఆయనపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అభి, సురేంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న అమీద్దీన్

వేసవి శిబిరాల పరిశీలన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక పుట్టపర్తి నారాయణ ఆచార్యుల ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వేసవి శిబిరాలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి గురువారం అమీద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన శిబిరం గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ కార్యక్రమాలను టెలికాస్టింగ్ అఫ్ ది మోరల్ స్టోరీస్, స్టోరీ లిజనింగ్, స్టోరీ రైటింగ్, మ్యాథమెటిక్స్, స్పోకెన్ ఇంగ్లీష్, ఇండోర్ గేమ్స్, చెస్, క్యారమ్స్ తదితర ఆక్టివిటీలను నిర్వహించే విధానాన్ని అడిగి తెలుసుకున్నాడు. ముందుగా స్టోరీ రీడింగ్, స్టోరీ లిజనింగ్ కార్యక్రమాలను లాప్‌టాప్ సిస్టం ద్వారా టెలికాస్ట్ చేసి చూపించారు. తర్వాత మ్యాథమెటిక్స్ క్లాస్ సమయంలో జనరల్ మాథ్స్ అవేర్నెస్, డివిజిబిలిటీ ఆఫ్ రూల్ 11 గురించి, క్రో-ప్రైమ్ గురించి సంయుక్తారాణి వివరించారు. చాడ మునిరెడ్డి బోర్డుపై సుమతీ శతకం పద్యం, కథను బోర్డు మీద రాసి దాని అర్థం, భావాన్ని విద్యార్థులచే చదివించి వాటి యొక్క భావం గురించి వివరించారు. కార్యక్రమంలో స్పోకెన్ ఇంగ్లీష్ మాస్టర్ పవన్‌కళ్యాణ్, విద్య, గ్రంథాలయాధికారి అధికారి తిరుపతమ్మ పాల్గొన్నారు.

నాలుగు మండలాల్లో టిడిపిదే పైచేయి

ప్రజాశక్తి - చాపాడు

సార్వత్రిక ఎన్నికల్లో మైదుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో నాలుగు మండలాల్లో టిడిపిదే పైచేయిగా నిలిచింది. అందులో మైదుకూరు మున్సిపాలిటీ, మండలంలో టిడిపి అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్‌కు అత్యధికంగా 12,988 ఓట్ల మెజార్టీ లభించింది. దువ్వూరు మండలంలో 3047, ఖాజీపేటలో 465, బి.మఠంలో 3499 ఓట్ల మెజార్టీ పుట్టాకు లభించింది. చాపాడు మండలంలో మాత్రమే 84 ఓట్ల స్వల్ప మెజార్టీ వైసిపి అభ్యర్థి ఎస్.రఘురామిరెడ్డికి వచ్చింది. 2019 ఎన్నికల్లో 5 మండలాల్లో వైసిపికి మెజార్టీ వచ్చింది. దువ్వూరులో 4,675, మైదుకూరులో 2,741, చాపాడులో 8,411 ఖాజీపేటలో 8,879, మఠంలో 4,605 ఓట్ల మెజార్టీ రాగా.. ప్రస్తుత ఎన్నికల్లో అందుకు పూర్తి భిన్నంగా చాపాడు మినహా మిగిలిన అన్ని మండలాల్లో పుట్టా పట్టు సాధించారు. దీంతో 21 వేల ఓట్ల మెజార్టీతో పుట్టా సుధాకర్ యాదవ్ విజయం సాధించారు.

ఇండియా వేదికకు చంద్రబాబు, పవన్ మద్దతు ఇవ్వాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఇండియా వేదికకు టిడిపి అధినేత చంద్రబాబు, జనసేనా అధినేత పవన్‌కల్యాణ్ మద్దతు ఇచ్చి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా కోరారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి అత్యధిక మెజార్టీతో గెలవడం హర్షణీయమన్నారు. రాష్ట్రానికి అన్ని విధాలా అన్యాయం చేసిన ఎన్‌డిఎ కూటమికి మద్దతు ఇవ్వడం వల్ల ప్రయోజనం ఉండదని తెలిపారు. ఇండియా వేదికకు మద్దతు ఇస్తే ఎపికి ప్రత్యేకహోదాతోపాటు కడప స్టీల్ ప్లాంట్, పోలవరం నిధులు, విశాఖ రైల్వేజోన్ వస్తాయన్నారు. రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు, పవన్ ఆలోచించాలని ఆయన సూచించారు. చంద్రబాబుకు ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ మద్దతు ఇవ్వడం జరిగిందని, అ విషయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. ఇండియా వేదికతోనే ప్రజాస్వామ్యానికి రక్షణ ఉంటుందని తెలిపారు. తెలుగు ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలని కోరారు.

ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పదవికి తిరుపాల్‌రెడ్డి రాజీనామా

ప్రజాశక్తి - దువ్వూరు

రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పదవికి రాజీనామా చేసినట్లు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి తెలిపారు. ఆ మేరకు తన రాజీనామా పత్రాన్ని రాష్ట్ర చీఫ్ సెక్రటరీకి మెయిల్ ద్వారా పంపినట్లు తెలిపారు. అనంతరం తన రాజీనామా పత్రాన్ని మీడియాకు అందచేశారు. తనకు ఈ అవకాశాన్ని కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు జరుగుతున్న సందర్భంగా తాను రాజీనామా చేసినట్లు తిరుపాల్‌రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వం రైతు సంక్షేమ, అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిందన్నారు.

ఆహార పొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి - మైదుకూరు

దువ్వూరు మండలం రామాపురం గ్రామానికి చెందిన దివంగత గుర్రం వెంకట రాఘవేంద్ర నాయుడు 3వ వర్ధంతి పురస్కరించుకొని మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని మహాత్మా గాంధీ నిరాశ్రయుల వసతి గృహంలో నిరాశ్రయులకు గురువారం ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలో యాచక వృత్తితో జీవిస్తున్న సాధువులకు, బిచ్చగాళ్లకు, వృద్ధులకు అందజేశారు. కార్యక్రమంలో గుర్రం రఘునాథ నాయుడు, చంద్రిక, పూజిత, చేయూత చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు మోతె ఉపేంద్ర, సుశీలమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఇమ్మడిశెట్టి సతీష్ బాబు, వాగ్దాడం శివశంకర్, ఉదయ్ శంకర్ పాల్గొన్నారు.

నిరాశ్రయులకు ఆహారాన్ని అందజేస్తున్న దాతలు

శాశ్వత పరిష్కారం దొరికేనా..!

సెంట్రల్ బోలే వార్డులో నిలుస్తున్న వర్షపు నీటితో ప్రజలకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ సుందరీకరణలో భాగంగా సెంట్రల్ బోలేవార్డ్‌లో వర్షపునీరు నిలుస్తుండడంతో ప్రజలకు తిప్పలు తప్పడంలేదు. దీన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.5.40 కోట్ల ఖర్చు పెట్టారు. అయితే వర్షం వచ్చిందంటే నీరు నిలుస్తోంది. ఈ నీటిని ట్యాంకర్లతో తోడయాల్సిందే. వర్షపు నీరు బయటకు పోవడానికి మార్గం లేకుండా నిర్మాణ పనులు చేయ డంతో సమస్య తలెత్తింది. ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి నిర్మించిన సెంట్రల్ బోలే వార్డు పనుల వల్ల నిలుస్తున్న వర్షపునీటితో ప్రజలకు అవస్తలు తప్పడం లేదు. సెంట్రల్ బోలే వార్డుకు కోట్ల రూపాయల నిధులు వెచ్చించి నిర్మించారు. కేవలం కాంట్రాక్టర్ కోసమే ఇది పనిచేశారా అన్నట్లుగా ప్రజల నుంచి ప్రశ్నలు మొదలవుతున్నాయి. పట్టణంలోని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు సెంట్రల్ బోలే వార్డు పనులను పర్యవేక్షించారా లేక కాంట్రాక్టర్ తన సొంత తెలివి తేటలతో సెంట్రల్ బోలే వార్డును నిర్మించారా అనే సందేహాలు వస్తున్నాయి. వర్షం వస్తే ఈ విధంగా ఎక్కడ చూసినా వర్షపు నీరు నిలుస్తోంది. చిన్నపాటి వర్షానికే సెంట్రల్ బోలే వార్డులో నీరు నిలుస్తోంది. దుకాణాల యజ మాను లకైతే అక్కడ నిలిచిన మురికినీటితో అల్లాడిపోతున్నారు. గతంలో వర్షం వస్తే ఎక్కడ చూసినా నీరు నిలుస్తోందనే ఉద్దేశంతో సెంట్రల్ బోలే వార్డుపై ప్రత్యేకశ్రద్ధ వహించి నిర్మించామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల కాంట్రాక్టర్ ఇష్టాను సారంగా పనులు చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. సెంట్రల్ బోలే వార్డుకు వేసిన రోడ్డు ఎత్తుపల్లాలుగా ఉండడం వల్లే వర్షపునీరు నిలుస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సెంట్రల్ బోలే వార్డులో నిలుస్తున్న నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

ట్యాంకర్‌తో నీటిని తోడుతున్న మున్సిపల్ అధికారులు

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలి

విత్తన నిల్వలను పరిశీలిస్తున్న ఎఒ నాగార్జున

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం నిర్ణయించిన ధర (ఎంఆర్‌పి)కే విత్తనాలు, పురుగు మందులు విక్రయించాలని ఎఒ నాగార్జున అన్నారు. గురువారం స్థానిక పురుగు, విత్తన దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమ్మకాలకు సంబంధించి రికార్డ్స్‌ను పరిశీలించారు. అనంతరం ఎఒ మాట్లాడుతూ.. మండలం వ్యాప్తంగా ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్టె విత్తనాలు, జనములు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులు భూమి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎకరాకు 10 కిలోల వంతున 5 ఎకరాల వరకు 50 శాతం సబ్సిడీతో రైతులు పొందవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ముద్దనూరు : రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని ఎఒ వెంకటకృష్ణారెడ్డి డీలర్లకు సూచించారు. మండలంలోని విత్తన దుకాణాలను గురువారం వ్యవసాయ అధికారి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ నిల్వలు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు రసీదు ఇవ్వాలని సూచించారు. రైతులకు అనుమతి లేని ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బిల్లు పుస్తకాలు సక్రమంగా రాసి పెట్టుకోవాలన్నారు. ప్రతి డీలర్ వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన ఉత్పత్తులను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. విత్తన దుకాణాల్లో కాలం చెల్లిన ఉత్పత్తులు ఉంచరాదన్నారు. నాసిరకం ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దుకాణాల్లో విత్తన, ఎరువుల నమూనాలు సేకరించి పరిశీలన నిమిత్తం ప్రయోగశాలకు పంపినట్లు ఎఒ తెలిపారు.

ఎర్రగుంట్ల : మండలంలోని విత్తన దుకాణాల్లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి స్టాక్ నిల్వలను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించినట్లు ఎఒ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని డీలర్లకు సూచించారు. డీలర్లు విత్తన నియంత్రణ చట్టం 1983 ప్రకారం అలాగే విత్తన నియమ నిబం ధనలు 1986ను అనుసరించి వ్యాపార లావాదేవీలు కొనసాగించాలని కోరారు.

సింహాద్రిపురం : ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధిక ధరలకు ఎరువులు

దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎఒ శివమోహన్‌రెడ్డి

విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి శివమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో ఎరువుల, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని దుకాణాల్లో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. డీలర్లు ప్రభుత్వం నిర్ణయించిన మేరకే విక్రయించాలన్నారు. ప్రభుత్వ నిషేధించిన గ్లైసెల్(గడ్డి మందు) విక్రయించరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డులను తప్పనిసరిగా నమోదు చేయడంతోపాటు రైతులకు కొనుగోలు చేసిన ప్రతి దానికి బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని ఆయన సూచించారు.

సంబరాల్లో ఎన్‌డిఎ కూటమి నాయకులు

సంబరాల్లో టిడిపి కార్యకర్తలు

ప్రజాశక్తి - చక్రాయపేట

రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి తెలుగుదేశం, జనసేన, బిజెపి ఘన విజయం సాధించడంతో గురువారం టిడిపి కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. చక్రాయపేట మెయిన్ రోడ్డు మీదుగా ఉప్పల వాండ్లపల్లె వరకు బైకులపై జెండా కట్టుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాలేసాబాగారి గౌస్, కర్నాటి రేవతి రెడ్డి, షేక్ మహబూబ్ బాషా (యమగోల), ముళ్ళ హయత్ బాషా, మునిరెడ్డి, శామీర్, ఉప్పలవాండ్లపల్లె కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : రాష్ట్రంలో భారీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలవడంతోపాటు జమ్మలమడుగులో ఆదినారాయణరెడ్డి విజయం సాధిండచంతో నేతలు సంబరాలు చేసుకున్నారు. నగర పంచాయితీ పరిధిలో గురువారం కూటమి నేతలు టీడీపీ కార్యాలయం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేలుస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. మండల ఇన్‌ఛార్జి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 164 అసెంబ్లీ స్థానాలు, 21 ఎంపీ స్థానాలను గెలవడంతో వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో స్పష్టంగా అర్థమైందన్నారు. జమ్మలమడుగులో ఆదినారాయణరెడ్డికి భారీ మెజారిటీ రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్తకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మండల నాయకులు మల్లు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎర్రగుంట్ల మండలంలో సుధీర్‌రెడ్డి హయాంలో అభివృద్ధి కుంటు పడిందన్నారు. కార్యక్రమంలో రాజగోపాల్ రెడ్డి, అంబటి కృష్ణారెడ్డి, మేకల జగన్ మోహన్‌రెడ్డి, కోడూరు మాజీ సర్పంచ్ శివారెడ్డి, సంజీవ్ రెడ్డి, బాలుడు, హరి ఓబుల్‌రెడ్డి, దాసరి రాజారెడ్డి, చిలంకూరు ఎంపిటీసీ నవీన్, కోడూరు సర్పంచ్ వాసుదేవరెడ్డి, జంగం రెడ్డి, వలసపల్లి సర్పంచ్ రామ చంద్రా రెడ్డి, కొండారెడ్డి, రమేష్ రెడ్డి, జాకట విజయశేఖర్ పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

రాష్ట్రానికి చంద్రబాబు న్యాయం చేయాలి

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సారైనా న్యాయం చేయాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి కోరారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబుకు నూతనంగా గెలిచిన ఎమ్మెల్యేలకు, ఎంపీ లకు తులసిరెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్ర విభజన సందర్భంగా 2014లో నాటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నవ్యాంధ్రప్రదేశ్‌కు అనేక వరాలు ప్రకటించిందన్నారు. రాష్ట్రానికి సంజీవని లాంటి ప్రత్యేకహోదా అమలు, రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహాలో ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ అమలు, కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం నిర్మాణం, దుగ్గరాజపట్నం ఓడరేవు నిర్మాణం, రాజధాని ఏర్పాటుకు నిధులు, పొలవరం ప్రాజెక్టు పూర్తి, విశాఖ మెట్రో రైలు, విశాఖ రైల్వే జోన్, విశాఖ-చెన్నై కారిడార్ ఏర్పాటుతోపాటు అనేక అంశాలు ఉన్నాయన్నారు. కాంగ్రెసు అధికారంలోకి వచ్చి ఉంటే ఈ అంశాలు అన్ని అమలై ఉండేవన్నారు. విభజన అంశాలు రాబట్టక పోతే జగన్‌కు పట్టిన గతే పడుతుందని తులసిరెడ్డి పేర్కొన్నారు.

బిసిజి వ్యాక్సిన్ వేయించుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

క్షయ వ్యాధి నివారణకు అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ వేయించుకోవాలని డిప్యూటి పారా మెడికల్ అధికారి శంకరయ్య, టి.బి.సూపర్‌వైజర్ రాజారత్నం సూచించారు. క్షయవ్యాధి నివారణకు ముందుజాగ్రత్త చర్యల్లో మొదటి విడతలో భాగంగా మధుమేహవ్యాధిగ్రస్తులకు, ధూమపానం అలవాటున్నవారికి, గతంలో టిబి వచ్చిన వారి కుటుంబ సభ్యులకు బియంఐ 18కంటే తక్కువ ఉన్నవారికి గురువారం అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో బిసిజి వ్యాక్సిన్ వేశారు. క్షయ వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనల మేరకు మందులు సకాలంలో వాడాలన్నారు. జబ్బులు దరిచేరకుండా ఉండాలంటే శుభ్రత, మంచి ఆహార అలవాట్లు కలిగి ఉండాలన్నారు. వర్షాకాలంలో ప్రజలు అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో సిఎంఒ సుబ్బారెడ్డి, సిద్దారెడ్డి, ఎఎన్ఎం గృహలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

అధ్యాపకులకు సూచనలిస్తున్న విద్యాశాఖాధికారి కృష్ణయ్య

ఇంటర్ అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - వేంపల్లె

ఇంటర్ అడ్మిషన్లుపై అధ్యాపకులు ప్రత్యేకదృష్టి పెట్టాలని ప్రొద్దుటూరు ఉప విద్యాశాఖాధికారి కృష్ణయ్య కోరారు. గురువారం స్థానిక జిల్లా బాలికల ప్లస్ పాఠశాలను ఆయన తనీఖీ చేశారు. ఇంటర్ అడ్మిషన్లుపై పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ ఎం శ్రీనువాసులును అడిగి తెలుసుకున్నారు. అడ్మిషన్లు ఎక్కువ అయ్యేలా ఇంటింటికి వెళ్లి విద్యార్థులను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ స్టాలిన్ ఐజాక్, పాఠశాల ప్లస్ పిజిటి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓటర్లకు కృతజ్ఞతలు

- పులివెందుల కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ధృవకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

సాధారణ ఎన్నికల్లో ఎలాంటి డబ్బులు పంపిణీ చేయకపోయినా కాంగ్రెస్ పార్టీ తరుపున పులివెందుల నుండి పోటీ చేసిన తనకు ఓట్లు వేసిన వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలని పులివెందుల కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ధృవకుమార్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి సహకారంతో పులివెందుల నియోజకవర్గం నుండి పోటీలో ఉన్న తనను ఆదరించి పులివెందుల నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజలు, స్నేహితులు, బంధువులు 10,083 ఓట్లు వేయడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెసు పార్టీని నియోజకవర్గంలో బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. షర్మిల, తులసిరెడ్డి సలహాలు, సూచనలతో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పట్ల ప్రభుత్వంతో పోరాటం చేస్తానని చెప్పారు. తన జీవితం పులివెందుల ప్రజల కోసమేనని తెలిపారు. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ కాంగ్రెస్ పార్టీ జెండా న్యాయం కోసం పని చేస్తుందన్నారు.

చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న పుట్టా, ఆయన కుమారులు

చంద్రబాబును కలిసిన 'పుట్టా'

ప్రజాశక్తి - చాపాడు

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును మైదుకూరు టిడిపి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ గురువారం కలిశారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా ఆయన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలి పారు. పుట్టా సుధాకర్ యాదవ్‌తోపాటు ఆయన కుమారులు ఏలూరు ఎంపీగా ఎన్నికైన పుట్టా మహేష్ కుమార్ యాదవ్, డాక్టర్ రవికుమార్ కలిశారు. తండ్రి, తనయులు ఎమ్మెల్యే, ఎంపీలుగా రాణించడంతో చంద్రబాబు వారిని అభినందించారు. టిడిపి సీనియర్ నాయకులు హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణను టిడిపి యువ నాయకులు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కూడా వీరు మర్యాదపూర్వకంగా కలిశారు.

అధికార అహంకారం ఓడింది.. ధర్మం గెలిచింది

- నియోజకవర్గ మాజీ వ్యవసాయ కన్వీనర్ పి.రామలింగారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్రంలో అధికార అహంకారంతో కూడిన ప్రభుత్వం ఓడింది.. ధర్మం గెలిచిందని జమ్మలమడుగు నియోజకవర్గ మాజీ వ్యవసాయ కన్వీనర్ పి.రామలింగారెడ్డి పేర్కొన్నారు. మైలవరం మండలం చిన్నకొమెర్ల గ్రామానికి చెందిన పి.రామలింగారెడ్డి స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ తాను 1997వ సంవత్సరం నుండి దేవగుడి కుటుంబంతో నడుస్తున్నానని తెలిపారు. దేవగుడి కుటుంబం చిత్తశుద్ధితో రాజకీయాలను చేస్తూ 2004 నుంచి 2019 వరకు పనిచేసిందన్నారు. ఆ సమయంలో నియోజకవర్గాన్ని ఆదినారాయణ రెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. ఆయన చేసిన మంచి పనులే ఈరోజు అసాధ్యమన గెలుపును సుసాధ్యం చేసిందన్నారు. రానున్న అయిదేళ్లల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే కాక ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తారన్నారు. ఈ సందర్భంగా రామలింగారెడ్డి వరుసగా నాలుగవసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆదినారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

టిడిపి గెలుపును జీర్ణించుకోలేని వైసిపి

ఖాజీపేట : టిడిపి అధికారంలోకి రావడాన్ని వైసిపి అగ్ర నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని, ఇవిఎంల ట్యాంపరింగ్ చేశారని పేర్కొనడం సరికాదని టిడిపి రాష్ట్ర ముస్లిం మైనారిటీ కార్య నిర్వాహక మాజీ కార్యదర్శి సిద్దారం ఖదీరుల్లా పేర్కొ న్నారు. గురువారం ఖాజీ పేటలో టిడిపి ముస్లిం మైనారిటీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దారం ఖదీరుల్లా మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబుకు ప్రజలు పట్టం కట్టారని తెలిపారు. అసత్య ఆరోపణలు గుప్పిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

IN THE COURT OF HON'BLE PRINCIPAL DISTRICT JUDGE, KADAPA

G.O.P.No. 25/2024

Mummadi Tanusree, Minor aged about 14 years, minor being rep by his natural guardian mother namely Mummadi Varalakshmi ...Petitioners

Vs

NILL. ...Respondents

GENERAL NOTICE

పై దావాలోని మైనర్ బాలిక తనుశ్రీ తండ్రి గారు అయిన ఎమ్.శ్రీధర్‌రెడ్డి, చనిపోయినందున శ్రీధర్‌రెడ్డి పేరుమీద ఉన్న ఆస్తిని అమ్ముటకు పర్మీషన్ కోరుచూ తనుశ్రీకి గార్డియన్ అయిన తల్లి ఎమ్.వరలక్ష్మి పై కోర్టులోపై G.O.P. దాఖలు చేసి ఉన్నారు. కావున పై దావాలోని షేడ్యూల్ దాఖల ఆస్తిని అమ్ముటకు ఎవరికైన అభ్యంతరము ఉన్న యడల పై కోర్టులో 24/6/2024వ తేదీన ఉ॥ 10.30 గంటలకు స్వయముగా కాని లేదా వకీలు ద్వారా కాని హాజరై ఆక్షేపణలు ఉన్నయడల తెలుపుకొనవలెను. లేనియడల మీ పరోక్షమున తీర్మానించబడును.

SCHEDULE

Kadapa District, Kadapa Urban Sub-District, within the limits of Municipal Corporation, Kadapa, in the village fields of Chinnachowk ward No.7, Corporation ward No.42, NGO Colony, interior of Bhagya Nagar Colony bearing D.No. 7/514, corporation ward No.42/514 RCC and zink sheet house presently dilaplated and remained vacant site in circar Punji D.No.91/1 and Circar Punji D.No.752/2 out of the above two Sy.Nos land in an extent of Ac.0.04cents or 0.016 Hectors in plot No.404 on the eastern side out of Ac.0.07cents 415 Sq.links bounded by

East: Public Road, West: House D.No. 42/513-9 in the same plot, North: Plot No.403, South: Public Road.

Measuring

East-West: on both sides: 41 feet or 12.50 meters

North-South: on both sides: 42 1/2 feet or 12.96 meters

Along with all other easementary rights on the eastern and Southern side with ingress and egress to the above said property.

//By Order of the Court//

M.SAINIRANJAN BABU

M. SAI VAMSI KRISHNA

Advocates,

KADAPA. Cell: 9689878029